క్లుప్తంగా

నేడు పరకాలలో మెగా జాబ్ మేళా

● హాజరుకానున్న మంత్రి శ్రీధర్‌బాబు

పరకాల : నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు పట్టణంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 50కి పైగా కంపెనీల్లో 5వేల పైచిలుకు ఉద్యోగాలు ఈ జాబ్ మేళా ద్వారా లభించనున్నట్లు తెలిపారు. జాబ్ మేళాను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా అందే ఉద్యోగ అవకాశాలపై సంబంధిత కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా రహమాన్

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇన్‌చార్జ్ వైస్ ప్రిన్సిపాల్‌గా, జనగామ పీజీ సెంటర్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రహమాన్ నియమితులయ్యారు. ఈమేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా తౌటం జయప్రకాశ్

హన్మకొండ: ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ కార్యాలయం నాన్ ఆపరేషన్ విభాగం అధ్యక్షుడిగా తౌటం జయప్రకాశ్ ఎన్నికయ్యారు. హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో గురువారం జరిగిన బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశంలో జయప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో వరంగల్ రీజియన్ చీఫ్ అడ్వైజర్ ఎంఎస్ రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గొలనకొండ వేణు, కార్యదర్శి మాదారపు సాంబయ్య, నాన్ ఆపరేషన్ కార్యదర్శి ఏరుకొండ ప్రవళిక పాల్గొన్నారు.

మండల పశువైద్యాధికారిగా మాళవిక

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల పశువైద్యాధికారి టి.మాళవిక గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన క్రాంతికుమార్‌ను భీమదేవరపల్లి మాణిక్యపురానికి బదిలీ చేశారు. మాణిక్యపురం పశువైద్యాధికారిగా పనిచేస్తున్న మాళవికను హసన్‌పర్తికి బదిలీ చేశారు. ఇటీవల 'వసూల్ రాజా' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ చేపట్టి చర్య తీసుకున్నారు. ఈ సందర్భంగా మాళవికకు వీఎల్‌ఓ సురేష్, ఎల్ఎస్ఏ అబ్దుల్ నబి, ఓఎస్ సాదిక్, రాహుల్ శుభాకాంక్షలు తెలిపారు.

డ్రాయింగ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

మడికొండ: డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేసి పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి అభినందించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పడాల రాజేందర్‌ను సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ వీరాచారి వెంకన్న, టెన్‌సింగ్, శ్రీను, శ్రీనివాస్, వీరస్వామి, జ్యోతి, స్వాతి, భావన, హారతి, రోజారాణి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఖిలా వరంగల్: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని రంగశాయిపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ సూచించారు. వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ఎస్), మాదక ద్రవ్య నిరోధక కమిటీ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, నాగ పరమేశ్వర చారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, పీఎల్ఎన్ మూర్తి, పరమేష్, శ్రీధర్, శైలజ, సుస్మిత, రాజన్న, రమేష్, కృష్ణవేణి, సమీనా, గీత, షరీఫ్ పాల్గొన్నారు.

హసన్‌పర్తి అభివృద్ధి కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: హసన్‌పర్తి అభివృద్ధి కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాజీ ఎంపీటీసీ, ముదిరాజ్ సంఘం మాజీ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, కన్వీనర్‌గా పెద్దమ్మ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జన్ను కిషన్, గౌరవ అధ్యక్షుడిగా కార్పొరేటర్ శివకుమార్, గౌరవ సలహాదారుడిగా అనుమాండ్ల విద్యాసాగర్, కోకన్వీనర్‌గా దీకొండ భిక్షపతి, రమేష్, ఉపాధ్యక్షులుగా దాడి రాజు, నల్ల కిరణ్, పెద్దమ్మ క్రాంతి, మానుపాటి రమేష్, గోప రాజు కుమారస్వామి, పోతరాజు మధుకర్, కోశాధికారిగా జనగాని ప్రశాంత్ గౌడ్, ఉప కోశాధికారిగా మేకల హరిశంకర్, మీడియా ఇన్‌చార్జ్‌గా చిరంజీవి, కార్యదర్శులుగా వేల్పుల సాయికుమార్, శీలం వంశీ, సంయుక్త కార్యదర్శులుగా పెద్దమ్మ ప్రశాంత్, తిరుపతిరెడ్డితో పాటు తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

'ఉపాధి' డబ్బులకు ఎదురుచూపు..

● ఖాతాల్లో ఆలస్యంగా జమవుతున్న వైనం
● నామమాత్రంగా రూ.7 పెంచిన కేంద్రం
● రూ. 200కు మించని కూలి
● ఆందోళనలో కూలీలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఐనవోలు : పేద ప్రజలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. కూలీలు చేసిన పనికి లెక్కగట్టి అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయగా ఆయా కూలీలకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావాల్సి ఉంటుంది. కానీ చేసిన కూలీకి డబ్బులు సకాలంలో జమ కావడం లేదని, చాలా ఆలస్యం అవుతుందని ఉపాధి హామీ కూలీలు వాపోతున్నారు. ఒక్కోసారి చేసిన పనికి నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీసం నెల రోజుల కంటే ముందుగా కూలీ డబ్బులు తీసుకునే అవకాశం ఉండటం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. గరిష్ఠంగా 15 రోజుల్లో ఉపాధి కూలీలకు డబ్బులు అందేలా చట్టం ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదని విమర్శిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు గత సంవత్సరం రూ.300 అందిస్తుండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26కు గాను కేవలం రూ.7 మాత్రమే నామమాత్రంగా పెంచి చేతులు దులుపుకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏప్రిల్ 1 నుంచి రూ.307 కూలీ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం అధికారులకు సూచించగా రూ.400 ఉండేలా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని పలు వ్యవసాయ కార్మికులు కోరుతున్నారు.

రూ.200 మించడం లేదు

రూ.307 వేతనం అందించాలని కేంద్రం చెబుతున్నప్పటికీ ప్రాక్టికల్‌గా కూలీలకు ఓవరాల్ యావరేజ్‌గా రూ.221 మాత్రమే లభిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై చర్యలు తీసుకుని రూ.307 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలతో పాటు కార్మికులు కోరుతున్నారు. పని చేసిన తర్వాత నెల, రెండు నెలలకు కాకుండా కనీసం వారం రోజుల్లో ఉపాధి డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని కూలీలు కోరుతున్నారు.

కేవైసీ అప్‌డేట్ చేసిన ఖాతాల్లో జమ

ఉపాధి కూలీలు ఇచ్చిన బ్యాంకు, పోస్టాఫీసు అకౌంట్ నంబర్లలో డబ్బులు జమ కాకపోవడంతో కొంత మంది ఆందోళన చెందుతున్నారు. పని చేశాం కాని మాకు డబ్బులు రాలేదనే ఫిర్యాదులు తరచుగా వస్తున్నాయి. వీటిని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు పరిష్కరిస్తున్నారు. అధికారులు చెబుతున్న ప్రకారం ఉపాధి డబ్బుల పేమెంట్ వ్యక్తిగత ఆధార్‌తో ఇటీవల అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో మాత్రమే జమ అవుతాయని అంటున్నారు. కొంత మంది గ్రామాల్లో గతంలో వారికి బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ ఇటీవల లోన్ల కోసం పలు ప్రైవేటు బ్యాంకుల్లో అకౌంట్‌లు ఓపెన్ చేసుకోగా కేవైసీ అప్‌డేట్ అవుతుంది. దీంతో మొదట వారు ఇచ్చిన అకౌంట్‌లో కాకుండా ప్రస్తుతం కేవైసీ అప్‌డేట్ చేసిన ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని అధికారులు సూచిస్తున్నారు.

రూ. 307 చెల్లించాలి



ప్రస్తుతం పనిని బట్టి ప్రభుత్వం ఒక్కో రోజు రూ.210, 190, 220 ఇలా డబ్బులు చెల్లిస్తుంది. కానీ ఇస్తామంటున్న రూ.307 మాత్రం చెల్లించడం లేదు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోని ఆసాములకు ఉపయోగపడే పనులు కల్పించాలి.

– యాకమ్మ, ఉపాధి కూలీ, కక్కిరాలపల్లి

ఆలస్యంగా జమవుతున్నాయి



ఉపాధి హామీ పథకంలో పనిచేసిన తర్వాత 40 నుంచి 60 రోజుల మధ్యలో డబ్బులు బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయి. నిత్యావసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. వారం రోజుల్లో కూలీ డబ్బులు కూలీలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

–అరూరి ఎల్లమ్మ, ఉపాధి కూలీ, కక్కిరాలపల్లి

పేదల ఆకలి తీర్చేందుకే సన్నబియ్యం

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ధర్మసాగర్ : బియ్యం పంపిణీని చేస్తున్న ఎమ్మెల్యే

ధర్మసాగర్ / వేలేరు : పేదల ఆకలి తీర్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి, ముప్పారం, ధర్మసాగర్, వేలేరు మండలంలోని పలు గ్రామాల్లో గల రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 10 లక్షల మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందించేందుకు రూ.13,500 కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి, ప్రభుత్వం అందించే బియ్యం పేదలకు చెందాలనే లక్ష్యంతో ఈ పథకానికి నాంది పలికినట్లు చెప్పారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి నియోజకవర్గంలో ఏం పనులు చేశాడో అందరికీ తెలుసని, తాను ఒక్కొక్కటిగా అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నానని హామీ ఇచ్చారు. ఆర్డీఓ రమేశ్ రాథోడ్, డీసీఓ కొమురయ్య, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్, రేషన్ డీలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ వెంటే రాష్ట్ర ప్రజలు

● 'కుడా' చైర్మన్ ఇనగాల



రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు

ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ వెంటే రాష్ట్ర ప్రజలు ఉన్నారని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు. మండలంలోని నీరుకుళ్లలో గురువారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో పాల్గొని రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, మాజీ సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, నాయకులు వరుణ్‌గాంధీ, అశోక్, పానుగోటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేయిచేయి కలిపి.. అండగా నిలిచి



శాయంపేట : రాజమౌళి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న యువకులు

● బాధిత కుటుంబానికి యువకుల సాయం

శాయంపేట : ఇంటి పెద్ద అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబం ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయింది. గమనించిన గ్రామానికి చెందిన పలువురు యువకులు తలోకొంత పోగుచేసి రూ.23,500 నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గంగిరేణిగూడెం గ్రామానికి చెందిన చెంగిలి రాజమౌళి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూసి గ్రామానికి చెందిన యువకులు రూ.23,500 జమచేసి రాజమౌళి కుటుంబ సభ్యులకు అందించారు. దీంతో గ్రామస్తులు యువకులను అభినందించారు.



దామెర : ఆర్థికసాయం అందజేస్తున్న కాళీప్రసాద్‌రావు

దామెరలో బీజేపీ ఆధ్వర్యంలో..

దామెర : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ మాజీ సర్పంచ్ రాసమల్ల జనార్దన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసున్న ఆయన గురువారం మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు సదయ్య, చంద్రకిరణ్, క్రాంతికుమార్, రవీందర్, రవి, మహేందర్, రాజ్‌కుమార్, భద్రయ్య, ముఖేశ్ ఉన్నారు.

'డ్రంకెన్ డ్రైవ్'లో ఐదుగురికి జైలు

కాజీపేట / వరంగల్ క్రైం: కాజీపేట పట్టణంలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 21 మందిలో నలుగురికి రెండు రోజులు, ఒకరికి ఒకరోజు జైలు శిక్ష, 16 మందికి రూ.20,600ల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఫాతిమా చిన్నప్ప తీర్పునిచ్చారు. స్థానిక ట్రాఫిక్ సీఐ నాగబాబు కథనం ప్రకారం మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో చిన్న రేణుబాబు, రాచుటి బాలచంద్రుడు, భూక్య కొమురెల్లి, నల్ల రాజేష్‌కు రెండు రోజులు, వేముగంటి రవీందర్‌కు ఒకరోజు జైలు శిక్షను న్యాయమూర్తి ఖరారు చేశారు. వారిని పరకాల సబ్ జైలుకు పంపించినట్లు సీఐ వివరించారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.21,360, ఐదు సెల్‌ఫోన్లు, స్కోర్ షీట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఈమేరకు షేక్ సమీర్, తోట నవీన్, జావిద్, సలీమ్, షక్రుద్దీన్, గౌస్‌ను కాజీపేట పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ సార్ల రాజుతో పాటు సిబ్బంది సురేష్, సురేందర్, సాంబరాజు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయంలో లక్ష పుష్పార్చన

కాజీపేట: శ్రీరామ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో దేవతామూర్తులకు లక్ష పుష్పార్చన వేడుకలను గురువారం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పలువురు భక్తులు పుష్పార్చన చేశారు. అనంతరం 15 మంది దంపతులు శ్రీరామ హోమం నిర్వహించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామన్నపేట / ఖిలా వరంగల్: వివిధ అనారోగ్య కారణాల వల్ల ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు వైద్య ఖర్చుల సహాయ నిమిత్తం 14 మంది లబ్ధిదారులకు రూ.7 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీష, నాయకులు శ్రీమాన్, గోరంటల రాజు, బిల్ల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

కాజీపేట రూరల్: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కాజీపేట బాపూజీనగర్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం చేపట్టారు. షేక్ అజ్గర్, ఇప్ప శ్రీకాంత్, మానస మధు, సిరిల్ లారెన్స్ ఉన్నారు.

ఒప్పందం ప్రకారం డబ్బులు ఇవ్వాలని ధర్నా



కిషన్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న కొమురయ్య కుటుంబ సభ్యులు

శాయంపేట : ఆసామి వద్ద పాలేరుగా పనిచేస్తున్న వ్యక్తి వ్యవసాయ బావి వద్ద విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా.. నష్టపరిహారం ఇస్తానని పెద్దల సమక్షంలో ఒప్పదం కుదుర్చుకుని ప్రస్తుతం డబ్బులు ఇవ్వనంటూ మొండికేసిన ఆసామి ఇంటి ఎదుట బాధితురాలు ధర్నాకు దిగింది. ఈ సంఘటన మండలంలోని పత్తిపాకలో గురువారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన పిన్నింటి కిషన్‌రెడ్డి అనే వ్యక్తి దగ్గర మాదం కొమురయ్య 30 ఏళ్లుగా పాలేరుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 12వ తేదీన కొమురయ్య ప్రమాదవశాత్తు కిషన్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద విద్యుత్ ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో కొమురయ్య కుటుంబానికి రూ.24 లక్షలు నష్టపరిహారం ఇస్తానని పెద్దమనుషుల సమక్షంలో పిన్నింటి కిషన్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకుని బాండ్ పేపర్ రాసి ఇచ్చాడు. చనిపోయిన రోజు రూ.2లక్షల నగదు అందించినట్లు బాధితురాలు తెలిపారు. మిగతా డబ్బులు మార్చి 15న ఇస్తానని పెద్దమనుషుల సమక్షంలో కాగితం రాసి ఇచ్చాడని, కానీ ఇప్పటికీ డబ్బులు విషయంపై మౌనం వహిస్తుండడంతో మరోసారి అడిగినట్లు తెలిపారు. కానీ ఇప్పుడు కిషన్‌రెడ్డి డబ్బులు ఇవ్వనంటూ మొండికేసినట్లు తెలిపారు. దీంతో ఇంటి ఎదుట నిరసన చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనకు ఎలాంటి జీవనాధారం లేదని, కిషన్‌రెడ్డి నుంచి డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని బాధిత మహిళ కొ మురక్క వేడుకుంది. విషయం తెలుసుకున్న పోలీ సులు అక్కడకు చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన వి ర మించారు.

కేంద్రం సాయంతోనే సన్నబియ్యం పంపిణీ

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి



బియ్యం పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

దామెర : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన పథకంలో భాగంగా అందిస్తున్న సన్నబియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాము పంపిణీ చేస్తున్నామని చెప్పుకుంటుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒక్కో వ్యక్తికి 5 కిలోల సన్నబియ్యం ఉచితంగా ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో కలిపి 6 కిలోలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు రతన్‌కుమార్, రమేశ్, సాంబయ్య, సంతోశ్, కొమురయ్య, ప్రభాకర్, సాంబయ్య ఉన్నారు.

డంపింగ్‌యార్డును వినియోగించుకోవాలి

● డీపీఓ రమాకాంత్



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీఓ రమాకాంత్

శాయంపేట : మండల కేంద్రంలోని డంపింగ్‌యార్డ్‌ను గురువారం హనుమకొండ జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్ పరిశీలించారు. డంపింగ్ యార్డ్ నిరుపయోగంగా మారడానికి కారణం ఏంటని పంచాయతీ కార్యదర్శి రత్నాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డును నిరుపయోగంగా ఉంచకుండా వినియోగించి తడి,పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేసి విక్రయించాలని సూచించారు. చెత్తను రోడ్డుకిరువైపులా కుప్పలుగా పోసి కాల్చొద్దని, గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో సేకరించిన చెత్తను నేరుగా డంపింగ్ యార్డ్‌కు తరలించాలని సూచించారు. రోడ్లపక్కన చెత్తను పోసి తగలపెడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గల రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ రంజిత్‌కుమార్ ఉన్నారు.

సంక్షిప్తంగా

ఇద్దరు మున్సిపల్ ఉద్యోగుల సరెండర్

పరకాల : పరకాల మున్సిపల్ కార్యాలయంలో మాజీ కౌన్సిలర్‌తో కలిసి ఓ ఇంటి దస్త్రాలు మాయం చేశారనే ఆరోపణలపై రికార్డు అసిస్టెంట్ పి.శ్రీనివాస్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ జి.వెంకట్‌రెడ్డిని ఆర్డీఎంఏ సాహిద్ మసూద్‌కు సరెండర్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా ఇంటి దస్త్రాల మాయం ఆరోపణలపై ఏఈ రంజిత్, వార్డు అధికారి రమాదేవితో విచారణ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు.

ఎస్ఎఫ్ఐ కార్యకర్తల ముందస్తు అరెస్ట్

పరకాల : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూములకు వేలం నిలిపివేయాలటూ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరకాల పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. పట్టణంలో గురువారం తెల్లవారుజామున ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

బొగ్గు లారీ బీభత్సం



పరకాల : పట్టణంలో గురువారం తెల్లవారుజామున బొగ్గు లారీ బీభత్సం సృష్టించింది. భూపాలపల్లి నుంచి ఉప్పల్‌కు బయలుదేరిన బొగ్గులారీ.. హుజూరాబాద్ రోడ్డులోని పోచమ్మగుడి వద్ద అదుపు తప్పి డీవైడర్ పైకి దూసుకెళ్లింది. టైర్లు పేలిపోయి భారీ శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. అదే ఘటన మధ్యాహ్నం వేళ జరిగితే నిత్యం భక్తులు, ప్రయాణికులతో రద్దీగా ఉండే పోచమ్మ గుడి వద్ద ప్రాణాలకు ముప్పు వాటిల్లేదని పలువురు చర్చించుకున్నారు.

గ్రూప్–1 ర్యాంకర్‌కు సన్మానం



ఐనవోలు : మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన మహ్మద్ విలాయత్‌అలీ ఇటీవల ప్రకటించిన టీజీపీఎస్సీ గ్రూప్–1 ఫలితాల్లో 489.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 86వ ర్యాంక్, జోనల్‌స్థాయిలో బీసీ–ఇ క్యాటగిరిలో మొదటి ర్యాంకు సాధించిన విషయం తెలిసిందే. కాగా గురువారం తహసీల్దార్ విక్రమ్‌కుమార్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది విలాయత్‌అలీతో పాటు తండ్రి మహబూబ్ అలీని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. డీటీ అనిల్‌కుమార్, ఎంఆర్ఐ రాణి, ఏఆర్ఐ మల్లయ్య, ఏఎస్ఓ, సర్వేయర్, కార్యాలయ సిబ్బంది పున్నేలు గ్రామస్తులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఐకేపీ సీసీ మృతి

ఐనవోలు : అనారోగ్యంతో నందనం గ్రామానికి చెందిన ఐకేపీ సీసీ తాడూరు ప్రశాంత్(40) మృతిచెందాడు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో 9 ఏళ్లుగా సీసీగా విధులు నిర్వహించాడు. కాగా మహిళా సంఘాల ప్రతినిధులు, సీసీలు, స్థానికులు నివాళులర్పించారు.

సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగ విరమణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి గత నెలాఖరున ఉద్యోగ విరమణ పొందిన నాగబెల్లి ఎల్లయ్యను క్యాంపస్‌లోని సెనెట్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ఉద్యోగులు బుధవారం రాత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్, ఉద్యోగ సంఘాల బాధ్యులు వల్లాల తిరుపతి,



విష్ణువర్ధన్, శాగంటి శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగులు చొక్కారావు, రావు నారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలి

ఖిలా వరంగల్: యువత సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని యూత్ ఫర్ సేవా సంస్థ చీఫ్ మెంబర్ వెంకటేష్ మూర్తి, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, డైరెక్టర్ డాక్టర్ తాళ్ల వరుణ్ సూచించారు. వరంగల్ ఉర్సు బైపాస్ రోడ్డులోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో యూత్ ఫర్ సేవా కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర రావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు యువతే గొప్పశక్తిగా మారాలని సూచించారు. డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ వై.నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు అధికారులకు సన్మానం



వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్‌లో దీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సైలు జనార్దన్, ప్రేమలతను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ గురువారం సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రిటైర్డ్ పోలీస్ అధికారుల సేవలు నేటితరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్‌కుమార్, ఏఓ రామకృష్ణ, సూపరింటెండెంట్ రమాదేవి, ఆర్ఐ సతీష్, తదితరులు పాల్గొన్నారు.